ముస్లింలకు జగనన్న తోఫా

- షాదీఖానాకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి
- శంకుస్థాపన చేసినా నిర్మాణం మరిచిన చంద్రబాబు
- ఐదేళ్ల తర్వాత నెరవేరనున్న కొవ్వూరు ముస్లింల కోరిక

కొవ్వూరు: షాదీఖానా నిర్మాణం పట్టణంలోని ముస్లింల చిరకాల కోరిక. అందుకు నందమూరు రోడ్డులోని బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద షాదీఖానాకు ఎనిమిది సెంట్ల స్థలం కూడా ఉంది. టీడీపీ హయాంలో నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. రూ.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మాణం చేపడుతున్నామని శంకుస్థాపన వేళ అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. నిధులు మాత్రం విడుదల చేయలేదు. 2019 ఎన్నికలు సమీపించిన వేళ ముస్లింలను ఆకట్టుకునే యత్నాల్లో భాగంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం చేసిన మోసానికి ఈ శిలాఫలకం ఓ చేదు జ్ఞాపకం. కాగా ఈ ఏడాది మే 24న కొవ్వూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హోం మంత్రి తానేటి వనిత ఈ షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన సీఎం వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.



2018లో అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన షాదీఖానా శిలాఫలకం దుస్థితి



కొవ్వూరులో షాదీఖానా నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలం

చంద్రబాబు మాయ మాటలకు నిదర్శనం

చంద్రబాబు మోసపూరిత మాటలకు షాదీఖానా నిర్మాణమే సాక్ష్యం. 2018 జూలై 26న 'నగర దర్శిని-నగర వికాసం' పేరుతో సీఎం హోదాలో కొవ్వూరు వచ్చిన చంద్రబాబు ఓట్ల కోసం షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) రూ.50 లక్షలతో ఈ షాదీఖానా నిర్మిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత తొమ్మిది నెలలకు పైగా ఆయన అధికారంలో ఉన్నారు. నిర్మాణ పనులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అప్పట్లో కొవ్వూరు అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే అయిన కేఎస్ జవహర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. మంత్రిగా ఉండి కూడా జవహర్‌ను షాదీఖానా నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. దాంతో ముస్లింల ఆశలు నెరవేరలేదు. విచిత్రం ఏమిటంటే అప్పట్లో స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో సీఎం చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించారు. షాదీఖానా శంకుస్థాపన శిలాఫలకాన్ని సైతం ఆయన అక్కడే ఆవిష్కరించారు. కొద్ది రోజులకు ఆ శిలాఫలకం దిమ్మను పడగొట్టేశారు. శిలాఫలకాన్ని మాత్రం భద్రంగా తీసుకెళ్లి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని మర్కజ్ మసీదు వెనుక భద్రపరిచారు. ఈ నేపథ్యంలో షాదీఖానా సమస్యను ముస్లిం పెద్దలు హోం మంత్రి తానేటి వనితకు వివరించారు. దాంతో మే నెల 24న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వూరు పర్యటనలో మంత్రి వనిత షాదీఖానాకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో సీఎం నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

ముస్లింలను మోసగించిన టీడీపీ



షాదీఖానా నిర్మిస్తామని శంకుస్థాపన చేసిన టీడీపీ ప్రభుత్వం ముస్లింలను మోసగించింది. అప్పటి సీఎం చంద్రబాబు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు ప్రకటించి, కనీసం నిధులు కూడా విడుదల చేయలేదు. ఈ సమస్యను స్థానిక ముస్లిం పెద్దలు నా దృష్టికి తీసుకొచ్చారు. నేను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పరిస్థితిని వివరిస్తే వెంటనే ఆయన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. షాదీఖానా నిర్మాణం త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటా.

– తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

శంకుస్థాపన చేసి విస్మరించారు



టీడీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు కొవ్వూరులో షాదీఖానాకు శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు చేయడక పోవడంతో పనులు ప్రారంభం కాలేదు. శిలాఫలకం దిమ్మను సైతం పడగొట్టేశారు. శిలాఫలకాన్ని మసీదు వద్ద భద్రపరిచాం. షాదీఖానా కేటాయించిన స్థలం ఉంది. నిధులు మంజూరు చేయించాలని మంత్రి వనితను కోరాం. ఆమె సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉంది.

– ఎండీ సలీం,
మర్కజ్ మసీదు కమిటీ అధ్యక్షుడు, కొవ్వూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



పట్టణంలో షాదీఖానా నిర్మాణం ముస్లింల చిరకాల కోరిక. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడం హర్షణీయం. నిధులు మంజూరు చేయించిన మంత్రి వనితకు, జగనన్నకు కృతజ్ఞతలు. పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తారని ఆశిస్తున్నాం. ముస్లింలందరం జగనన్నకు రుణపడి ఉంటాం. మాట ఇస్తే నెరవేరుస్తాడన్న నమ్మకం జగనన్నపై ఉంది.

– ఎండీ జమీల్‌ఖాన్,
షాదీఖానా కమిటీ సభ్యుడు, కొవ్వూరు

క్లుప్తంగా

పైప్‌లైన్‌కు చిల్లు.. ఎగజిమ్ముతున్న తాగునీరు



వేగేశ్వరపురం వద్ద లీకవుతున్న తాగునీటి పైప్‌లైన్

తాళ్లపూడి: పైప్‌లైన్ నుంచి తాగునీరు లీకై వృథాగా పోతోంది. ప్రక్కిలంకలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని వాటర్ ప్లాంట్ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకూ శుద్ధి చేసిన గోదావరి జలాలను సరఫరా చేస్తున్నారు. తాళ్లపూడి నుంచి మలకపల్లి వైపునకు వెళ్లే పైప్‌లైన్ లీకవుతోంది. తాళ్లపూడి సమీపంలోని వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం కాలువ వద్ద ఇనుప పైప్‌లైన్ తుప్పు పట్టడంతో చిల్లు పడింది. దీంతో కొద్ది రోజులుగా నీరు పైకి ఎదచిమ్ముతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు వృథాగా పోతోంది. అశ్రద్ధ చేసే తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

17న అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలోని గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ హుండీని ఈనెల 17వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు తెరిచి లెక్కించనున్నట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు మంగళవారం తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. మండలంలోని ఆరికిరేవులు, కుమారదేవం, మద్దూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తులు నమోదు చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. 16న దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అభ్యర్థులకు 17వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఇంటర్వ్యూలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. 19న నియామక పత్రాలు అందజేస్తామని, 20 శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆరికిరేవుల గ్రామంలో ఎస్సీ మహిళకు, కుమారదేవం, మద్దూరు గ్రామాల్లో బీసీ మహిళలకు రిజర్వు చేశామన్నారు.

చాగల్లు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.రాంప్రసాద్ మంగళవారం తెలిపారు. చాగల్లు-1 సచివాలయంలో 1 (బీసీ-బి మహిళ), చిక్కాల-1 లో 1 (బీసీ-డి జనరల్), ఊనగట్లలో -1లో 1(బీసీ-బి మహిళ) కలవలపల్లి-1లో ఒక పోస్టుకు (ఎస్సీ-మహిళ) అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీలో పరిధిలో ఉండి 10 వ తరగతి ఉత్తీర్ణులైన 18 – 35 మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు దారులకు ఈ నెల 17న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

కూలీలు వైఎస్సార్ బీమా చేయించుకోవాలి

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలందరూ తప్పనిసరిగా వైఎస్సార్ బీమా నమోదు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు సూచించారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో పల్లారావు మాట్లాడారు. పనులు చేస్తున్న కూలీలకు వేతనాల చెల్లింపుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.

పది గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

కొవ్వూరు: వాణిజ్య సిలిండర్లకు బదులు గృహ వినియోగానికి వాడే సిలిండర్లు వాడుతున్న రెండు హోటళ్లపై దాడి చేసి పది గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు తెలిపారు. పట్టణంలోను, దొమ్మేరు గ్రామంలోను సివిల్ సప్లయిస్, రెవెన్యూ శాఖల సిబ్బంది సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించామన్నారు. దొమ్మేరు మహాలక్ష్మి రాజుల భోజన హోటల్‌లో ఆరు, కొవ్వూరులోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలో నాలుగు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. వీఆర్వోలు ప్రకాష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఇద్దరు దుకాణ యాజమానులపైన 6 ఏ కేసు నమోదు చేసినట్టు సీఎస్ డీటీ బాపిరాజు తెలిపారు.

విద్యుత్తు చార్జీలు తగ్గించాలి

నిడదవోలు: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుపై స్థానిక సంత మార్కెట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చార్జీల పెంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాంబాబు అన్నారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన ర్యాలీ

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం ఆరికిరేవులు, ధర్మవరం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఫ్లె కార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. జన్ భాగీధారీ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఉదయభాను కళావతి తెలిపారు. మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. రెండు రోజులుగా ఐదుగురు పిల్లల్ని చేర్పించామన్నారు. సర్పంచ్ మట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ మల్లిపూడి వెంకట్రావు, కార్యకర్తలు పి.ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు చక్కని పౌష్టికాహారం అందజేస్తున్నట్టు సెక్టార్ సూపర్‌వైజర్ బి.శిరీష అన్నారు. మన ఊరు-మన అంగన్‌వాడీలో భాగంగా బ్రాహ్మణగూడెంలో మంగళవారం జన్ భాగీధారీ కార్యక్రమం నిర్వహించారు. రెండున్నరేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కిశోర బాలికలకు, పిల్లలకు పోషకాహారాన్ని అందజేస్తున్నామని, అంగన్‌వాడీల ద్వారా కోడిగుడ్లు, ఐరెన్ మాత్రలు అందజేస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రాహ్మణగూడెంలో అవగాహన ర్యాలీ

పీహెచ్‌సీ వైద్యాధికారిపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం

పనితీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక

పెరవలి: పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ విజయ్‌కుమార్‌ను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డీఎంహెచ్‌వో మంగళవారం ఈ పీహెచ్‌సీకి విచ్చేసి విస్తృతంగా తనిఖీలు జరిపారు. పీహెచ్‌సీ డాక్టర్ పనితీరుపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో డీఎంహెచ్‌వో విచారణకు వచ్చినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేసి, ఆసుపత్రిలోని అన్ని గదులనూ పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్ మూసివేసి ఉంచడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పీహెచ్‌సీలో ఆపరేషన్లు జరిగి ఎన్నాళ్లయ్యింది? థియేటర్‌ను ఎందుకు మూసి ఉంచవలసి వచ్చింది? అంటూ డీఎంహెచ్‌వో ప్రశ్నలు సంధించారు. దీనికి వైద్యాధికారి విజయ్‌కుమార్ బదులిస్తూ థియేటర్ పక్కన సెప్టిక్ ట్యాంక్ కుంగిపోయినందున థియేటర్‌ను మూసివేశామన్నారు. ఆ సమాధానంతో సంతృప్తి చెందని డీఎంహెచ్‌వో 'పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారా.. లేరా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు డాక్టర్లున్న ఈ ఆసుపత్రిలో ఓపీ ఎందుకు తగ్గిందంటూ నిలదీశారు. ఏడాదిగా ఈ పీహెచ్‌సీకి వైద్య నిపుణులు వస్తున్నా, ఆ విషయాన్ని ఎందుకు పత్రికా ముఖంగా తెలియపరచలేదని నిలదీశారు. గర్భిణుకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరుపై అనేక ఫిర్యాదులు వచ్చాయని ఆయనన్నారు. ఇక్కడి పరిస్థితులు చూసిన తర్వాతే వాటిపై స్పందించవలసి వస్తోందన్నారు. పద్ధతి మార్చుకోక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్ విజయ్‌కుమార్, ఎ.కృష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెరవలి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కె. వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం యువకుడి అదృశ్యం

కొవ్వూరు: రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లు ప్రాంతానికి చెందిన కట్టా సూరిబాబు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. తల్లి మందలించిందనే మనస్థాపంతో ఆ యువకుడు ఈనెల 10న ఇంటి నుంచి బైక్‌పై బయటికి వచ్చేశాడు. 12న గామన్ ఇండియా బ్రిడ్జిపై ఆ యువకుడు వేసుకు వచ్చిన మోటారు సైకిల్ కనిపించింది. దీంతో ఆ యువకుడి తల్లి ధనలక్ష్మి మంగళవారం కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడం ఫిర్యాదు చేశారని పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. గోదావరి నదిలో దూకి ఉండవచ్చని భావిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్ నిరంతరం శ్రమిస్తున్నారు

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- మద్దులగూడెంలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన



పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండల పరిషత్ నిధులు రూ.13 లక్షల వ్యయంతో మద్దులగూడెంలో నిర్మించే గ్రామ పంచాయతీ నూతన భవనానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎమ్మెల్యే తలారి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించాక, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనను కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, మద్దులగూడెం సర్పంచ్ చెలికాని ప్రవీణ్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సొసైటీ చైర్మన్లు చెలికాని సంజయ్, భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, సర్పంచులు పోల్కంపల్లి అనిల్‌కుమార్, మానుకొండ ప్రసాద్, పసుపులేటి ఏసుబాబు, పెద్దిన దిలీప్, ఎంపీటీసీ సభ్యులు పల్లపాటి ధర్మారావు, మానుకొండ కన్నయ్య, యాచమనేని నాగేశ్వరరావు, చెలికాని బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

అటు భగభగలు.. ఇటు జలకాలాటలు



బ్యారేజీ దిగువన గోదావరి జలాల్లో స్నానాలు చేస్తున్న జనాలు

నిడదవోలు: పెరుగుతున్న ఉష్ణోగ్రత, ఉక్కపోతలను ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. వేడి వాతావరణం నుంచి వారు ఉపశమనం కోరుకుంటున్నారు. ఈ క్రమంలో మద్దూరు కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి జలాల్లో స్నానాలు చేయడానికి చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయసుల వారు ఎగబడుతున్నారు. బ్యారేజీ నుంచి విడుదల అవుతున్న జలాల్లోకి దిగి ఈత కొడుతూ సేద దీరుతున్నారు. నిడదవోలు, కొవ్వూరు, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, తణుకు తదితర ప్రాంతాల నుంచి పలువురు కుటుంబాలతో ఇక్కడ వచ్చి స్నానాలు చేస్తున్నారు. దాంతో ఇక్కడ కోలాహలంగా ఉంది. ఇక ఆదివారం అయితే ఈ సందడి మరీ ఎక్కువగా ఉంటోంది. యువత బ్యారేజీ పిల్లర్లు ఎక్కి దూకుతూ కేరింతలు కొడుతున్నారు. ఇక్కడ లోతు కూడా ఎక్కువగా లేకపోవడంతో పిల్లలు సైతం నీటిలో సందడి చేస్తున్నారు. సెల్‌ఫోన్‌లలో సెల్ఫీలు తీసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు.

సంపద తయారీ కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలి

ఉండ్రాజవరం: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు ఆదేశించారు. పాలంగి పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఈ షెడ్డును మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ షెడ్డు నిర్మాణం ఇప్పటికే 80 శాతం పూర్తయ్యిందన్నారు. మిగిలిన 20 శాతం పనులను త్వరగా పూర్తి చేసి, వ్యర్థాల నుంచి సంపద తయారీకి శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్క శ్రీనివాసు, కార్యదర్శి ఎండీ హసన్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు శ్రీకారం

నల్లజర్ల: షెడ్యూల్ ప్రకారం వచ్చేఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఆ ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేయడంతో మండల స్థాయిలో కొత్త ఓటర్ల జాబితాలో మార్పుల కసరత్తు ప్రారంభమైంది.

షెడ్యూలు ఇలా..

- ఈనెల 20న మారిన విధానాలపై ఈఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్వోలకు శిక్షణ
- జూలై21 నుంచి ఆగస్టు వరకూ ఇంటింటా బూత్‌లెవల్ అధికారుల పరిశీలన
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 29 వరకూ పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 10 వరకు ఫార్మెట్-1 నుంచి 8, డ్రాఫ్టరోల్ సిద్ధం చేస్తారు.
- అక్టోబరు17న డ్రాఫ్ట్ ఎలక్ట్రోరల్ ప్రచురణ
- అక్టోబరు 17 నుంచి నవంబరు 30 వరకూ ఓటర్ల జాబితాలో చేర్పులు, అభ్యంతరాల స్వీకరణకు దరఖాస్తుల స్వీకరణ
- డిసెంబరు 26 లోపు చేర్పులు, తొలగింపులు ఇతర క్లెయిమ్‌ల పరిష్కారం.
- 2024 జనవరి1న ఓటర్ల జాబితా తుది పరిశీలన
- 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుంది. సంబంధిత షెడ్యూల్ తహసీల్దారు కార్యాలయాలకు అందాయి.

యోగా కేంద్రంలో విద్యార్థులకు పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాలొన్న విద్యార్థులు

తాళ్లపూడి: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లపూడిలోని గాయత్రీ యోగాసేవా సమితి కేంద్రం వద్ద విద్యార్థులకు రోజూ సాయంత్రం ఆరు గంటలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ కేంద్రం గురువు నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ నెల 21న యోగా దినోత్సవం వరకూ విద్యార్థులకు చిత్రలేఖనం, చెస్, యోగా, రన్నింగ్, క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చాగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఊనగట్లకు చెందిన ఆత్కూరి వీర్రాఘవులు (62) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ సీహెచ్‌వీ రమేష్ కథనం ప్రకారం ఈ నెల 6న ఊనగట్ల- కుంకుడిమిల్లి మార్గంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్న ప్రమాదంలో వీర్రాఘవులు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచీ రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు.

విద్యార్థులకు కానుకల పంపిణీ

నిడదవోలు రూరల్: జగనన్న విద్యాకానుక విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తుందని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని విజ్జేశ్వరం, కంసాలిపాలెం ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నాలుగో విడత జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి తిక్కా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, నాయకులు దేవన బాబూరావు, కాపకాయల శ్రీను, మునికోటి దుర్గారావు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం జగనన్న విద్యాకానుకలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. స్థానిక పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంపీపీ కేవీకే దుర్గారావు విద్యార్థులకు కానుకలు అందజేశారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, షూస్, బెల్టు, యూనిఫాం, డిక్షనరీలతో కూడిన కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: గజ్జరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సర్పంచ్ గండి రాంబాబు చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నెహ్రూజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లభని శ్రీహరి, గన్నిన రత్నాజీ, కాకర్ల చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు గుంటు చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పైడిమెట్ట ప్రాథమిక పాఠశాల్లో కూడా విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు, ఉప సర్పంచ్ విత్తం నాని, నాయకులు కొల్లి దుర్గారావు, ఖండవల్లి రామచంద్రం, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



విజ్జేశ్వరంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, తిక్కా శ్రీనివాస్



దేవరపల్లిలో విద్యార్థులకు విద్యాకానుకలు అందజేస్తున్న ఎంపీపీ దుర్గారావు